క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన వెంకటరెడ్డి



వైసీపీ అధినేత జగన్‌తో వెంకటరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన కొల్లు వెంకటరెడ్డి గురువారం ఏపీలోని తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తనపై ఏపీ పోలీసులు నమోదు చేసిన కేసులతో పాటు కక్షపూరితంగా పెడుతున్న ఇబ్బందులను జగన్‌కు వివరించారు.

ఎఫ్‌ఆర్‌ఓ ఆర్థిక సాయం

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు అనారోగ్యంతో మరణించారు. మృతుడికి ముగ్గురు చిన్న ఆడపిల్లలు ఉన నేపథ్యంలో ఏడూళ్ల బయ్యారం ఎఫ్‌ఆర్‌ఓ తేజస్వీ ఆ కుంటుంబానికి రూ.5 వేలను వితరణగా అందించారు. తన కార్యాలయ సిబ్బంది ద్వారా గురువారం మృతుని భార్యకు ఆ నగదును అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోలెబోయిన సాంబశివరావు, రామారావు, కొమరం కాంతారావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సత్కారం



విద్యార్థి ప్రణీత్, తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

చర్ల: చర్లలోని గురుదేవ్ విద్యాలయ పూర్వ పీవీ ప్రణీత్ సిద్దిపేటలోని మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. దీంతో విద్యాలయం ప్రిన్సిపాల్ హెచ్‌జీవీ గిరిప్రసాద్ నేతృత్వంలో విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థితో పాటు తల్లిదండ్రులు పానుగంటి రామ్మోహన్–సామ్రాజ్యంలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని విద్యాభ్యాసం సాగించాలని, అప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో విద్యాలయం అకడమిక్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరి

పినపాక: 50 వేలకు మించి నగదు ఎవరైనా తీసుకువెళ్తే దానికి సంబంధించిన రశీదు తప్పనిసరి ఉండాలని ఈ బయ్యారం ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం బయ్యారం క్రాస్ రోడ్‌లో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని, ఎవరైనా అవసరాలకు నగదు తీసుకువెళితే వాటికి తగిన రశీదు వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన సంద శ్రీను–మదలీన దంపతులు (లండన్), వారి కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న గోగినపల్లి ప్రభాకర్

అశ్వారావుపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని దిబ్బగూడెం(దురదపాడు) గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పాయం పోతురాజు, కారం తులసి, పూనెం దుర్గమ్మ, మొడియం వనజా, సున్నం రామయ్య, కాక బాబురావు, కారం రాజులు పాల్గొన్నారు.

‘మల్చింగ్’ సాగుకే మొగ్గు

- ఆసక్తి కనబరుస్తున్న మిర్చి రైతులు
- దుమ్ముగూడెం మండలంలో 80 శాతం ఇదే ఒరవడి..



నర్సాపురంలో మల్చింగ్ విధానంతో సాగు చేస్తున్న మిర్చి పంట

దుమ్ముగూడెం: మండలంలోని మిర్చి పంట వేసే రైతులు మల్చింగ్ పద్ధతిలో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి సాగు పనులు జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండు కుండగా మారడంతో పాటు వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో కొందరు రైతులు సాధారణ పద్ధతిలో మిర్చి సాగు చేస్తుండగా.. ఎక్కువ మంది రైతులు మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చీడపీడల నివారణ, కలుపు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించేందుకు ఎక్కువగా రైతులు మల్చింగ్ పద్ధతిని పాటిస్తున్నారు.

మండలంలోని నర్సాపురం, సీతారాంపురం, తూరుబాక, గంగోలు, లక్ష్మీనగరం, బండారుగూడెం, కొత్తపల్లి, పర్ణశాల, దుమ్ముగూడెం, గ్రామాల్లో మల్చింగ్ పద్ధతిని అవలంబిస్తూ రైతులు ఉత్సాహంగా మిర్చి పంట సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 1900 ఎకరాల మేర మిర్చి సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వీటిలో 80 శాతం పైగా మల్చింగ్ సాగుపై రైతులు దృష్టిపెడుతున్నట్లు వారు చెబుతున్నారు.

మల్చింగ్‌తో సాగు ఇలా..

మిర్చి మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 నుంచి 10 సెంటీమీటర్ల లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడి పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. దీనివల్ల మాల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

మల్చింగ్ షీటును బలంగా లాగకూడదు. సాయంత్రం వేళల్లో మాత్రమే షీట్లను అమర్చాలి. ఎందుకంటే దీనికి సాగే గుణం ఉంటుంది కాబట్టి బలంగా లాగితే సాగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ గాలి ఉన్నప్పుడు కూడా మల్చింగ్ వేయకూడదు. పంటకాలం తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 7.25 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంటకాలానికి, 50–200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు 3 సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

మల్చింగ్‌తో ఉపయోగాలు..

మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల వివిధ కాలపరిమితులు గల పంటలకు 30–40 శాతం వరకు నీరు ఆదా అవుతుంది. ఇంకా దీనిని డ్రిప్ సిస్టం సేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు. మొక్కలకు వాటి జీవితకాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి 20 నుంచి 50 శాతం మేర నాణ్యతతో అధిక దిగుబడులు పొందవచ్చు. దీంతోపాటు భూమిలో ఎల్లప్పుడూ తేమ నిల్వ ఉండడం వల్ల నేల గుల్లబారి వేరు వ్యవస్థ బాగా వద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది. ఎండ రిఫ్లెక్ట్ అవ్వడం వల్ల మొక్కకు కింద నుండి పోషకాలు అందుతాయి దీని వలన ముడత నివారించవచ్చు.

కూలీల కొరతను నివారించవచ్చు..



గత కొన్నేళ్లుగా మల్చింగ్ విధానంతో 20ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్న. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉంటుంది. తద్వారా కూలీల కొరతను నివారించవచ్చు. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసుకోవచ్చు.

– వీరమాచినేని సునీల్, నర్సాపురం

నామినేషన్ల దాఖలు



దుమ్ముగూడెం: చిన్ననల్లబల్లి ఎంపీటీసీకి నామినేషన్ వేస్తున్న యలమంచి వంశీ



పినపాక: ఎన్నికల అధికారులతో చర్చిస్తున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్



బూర్గంపాడు: నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ తదితరులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఆయా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేయగా.. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అయితే, ఈ లోగా బీసీ రిజర్వేషన్ల విషయంలో కోర్టు స్టే విధించడంతో ప్రక్రియ నిలిచిపోయినట్లైంది.

8 నామినేషన్లు దాఖలు

దుమ్ముగూడెం: మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు జరుగనున్న ఎన్నికలకు గాను మొదటి రోజు 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల అధికారులకు అందజేశారు. వీరిలో చిన్ననల్లబల్లి ఎంపీటీసీ స్థానం నుంచి యలమంచి వంశీ (సీపీఎం), ప్రగళ్లపల్లి నుంచి కొర్సా చిలకమ్మ (సీపీఎం), దుమ్ముగూడెం నుంచి కల్లూరి లక్ష్మయ్య (సీపీఎం), లక్ష్మీనగరం నుంచి సరియం కోటేశ్వరరావు (సీపీఎం), నారాయణరావుపేట నుంచి అపకా రామకృష్ణ (సీపీఎం), నర్సాపురం నుంచి రావులపల్లి రవికుమార్ (సీపీఐ), రావులపల్లి పృథ్వీ (బీఆర్‌ఎస్), తూరుబాక నుంచి బొల్లి వెంకటరమణ (బీఆర్‌ఎస్)లు నామినేషన్లు అందజేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

రెండు నామినేషన్లు..

అశ్వాపురం: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియలో భాగంగా మొండికుంట ఎంపీటీసీ స్థానానికి జిల్లేపల్లి నాగలక్ష్మి, మంగి విజయ రిటర్నింగ్ అధికారికి గురువారం నామినేషన్లు అందజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద సీఐ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

పినపాక: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను గురువారం జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి పరిశీలించారు. నామినేషన్ స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థుల తరపున పరిమిత సంఖ్యలో వ్యక్తులను లోపలకి అనుమతించాలని, అందుకు అనుగుణంగా భారీగాట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్, ఏడీఏ తాతారావు, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల నామినేషన్ ప్రక్రియను పాల్వంచ డీఎస్పీ సతీష్ పరిశీలించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని డీఎస్పీ పరిశీలించి పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్ఐ మేడ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు

కరకగూడెం: పోషకాహారమే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మూలమని మణుగూరు ప్రాజెక్ట్ సీడీపీఓ జయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ‘పోషణ మాంసం’కార్యక్రమాన్ని ఆమె సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాశన, పిల్లకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. తల్లులు తమ ఆహారంలో చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని అలవరుచుకోవచ్చని సూచించారు. అలాగే గ్రామంలో పోషకాహార ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు భద్రమ్మ, రాజమణి, సుశీల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్య శిబిరం



ములకలపల్లి: విద్యార్థుల రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ములకలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్థానిక మంగపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది విజయలక్ష్మి, రమాదేవి, చెంచమ్మ, పావని విద్యార్థులకు రక్తహీనత, సికిల్ పరీక్షలు చేసి, వైద్య చికిత్సలు అందించారు. రక్త నమూనాలు సేకరించారు. ప్రిన్సిపాల్ కల్పన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అతహర్ అలీ, లెక్చరర్ల బృందం పాల్గొన్నారు.

తిర్లాపురంలో..

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సేవా సమితి, వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో తిర్లాపురం గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సౌజన్య గ్రామంలోని 134 మందికి వివిధ రోగాలకు మందులు అందజేసి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనంతలక్ష్మి, మారేశ్వరరావు, రాము, బాబు, తిర్లాపురం గ్రామస్తులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



మణుగూరురూరల్: పోలీసుల అదుపులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరురూరల్: రాష్ట్రంలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన ‘చలో బస్ భవన్’కార్యక్రమానికి వెళ్లకుండా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను గురువారం మణుగూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, వేర్పుల సురేష్, రామకోటి, బోశెట్టి రవిప్రసాద్, జక్కం రంజిత్ తదితరులున్నారు.

దమ్మపేట: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన బస్ భవన్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లకుండా మండల పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను గురువారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకుని, ముందస్తుగా అరెస్టులు చేశారు. అరెస్టైన వారిలో సోయం వీరభద్రం, వెంపాటి భరత్, గాజుబోయిన యేసు తదితరులు ఉన్నారు.

జలమయమవుతున్న వీధి



బీసీ అంగన్‌వాడీ కేంద్రం వీధిలో నిలిచిన నీరు

ములకలపల్లి: వర్షం పడితే మండలకేంద్రంలోని బీసీ అంగన్‌వాడీ సెంటర్ వీధి జలమయమవుతోంది. ఈ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ నేటికి పనులు చేపట్టలేదు. దీనికి తోడు దిగువ భాగంలోని జీపీ కార్యాలయ వీధికి ఇటీవలే సీసీ రోడ్డు వేశారు. ఈ ప్రదేశంలో కల్వర్టు కూడా పూడిపోయింది. వీధి దిగువ ప్రాంతం ఎత్తుగా మారడం, కల్వర్టు నుండి నీళ్లు బయటకు వెళ్లపోవడంతో వానొస్తే చెరువును తలపిస్తోంది. రాత్రి కురిసిన వర్షానికి వరద నీళ్లు ఇళ్లలోకి కూడా చేరడంతో స్థానికులు నానాఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు సత్వరమే నిర్మిస్తామని అధికారులు చెపుతున్నా, నేటికీ ఆచరణకు నోచు కోలేదు. ఇకనైనా దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

‘బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం’

మణుగూరురూరల్: 42శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా అన్నారు. 55 ఏళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. బీసీ రిజర్వేషన్లపై ఏనాడూ పాటుపడిన దాఖలాలు లేవన్నారు. ఆరు గ్యారెంటీ హామీల లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌పై డ్రామా చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో కొట్లాడి సాధించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షాలను భాగస్వామ్యం చేసుకుని ఢిల్లీ వేదికగా యుద్ధభేరి మోగించాలని, అందుకు ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ బీసీల కోసం గళమెత్తి నిలదీసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామకమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండల పరిధిలోని తిర్లాపురం గ్రామపంచాయతీలో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పెండ్యాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడగా ముత్యం రమేష్, కంపెర్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శగా పాయం రామనర్సయ్య, కార్యదర్శులుగా కంటెం సురేష్, గనిబోయిన స్వప్న, కోశాధికారిగా సోయం కృష్ణ, సహాయ కోశాధికారిగా గణేష్, సహాయ కార్యదర్శిగా సతీష్‌తోపాటు ఇతర శాఖ బాధ్యులను, సభ్యులను ఎన్నుకున్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



ధూమపానంతో నష్టాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పినపాక: ధూమపానానికి యువత దూరంగా ఉండాలని పినపాక ప్రభుత్వ వైద్యులు దుర్గ భవాని తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ నిర్వహించారు. అందులో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ప్రతి గ్రామంలో మద్యపానానికి వ్యతిరేకంగా క్యాంపులు ఏర్పాటు చేస్తామని, యువత వారి తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. వైద్యులు మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల గుంపుతో గుబులు!



ఆసుపాక-నందిపాడు మార్గంలో కోతుల గుంపు..

అశ్వారావుపేట రూరల్: మండలంలోని ఆసుపాక–నందిపాడు మార్గమధ్యలో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన పడుతున్నారు. గుంపులుగా రహదారిపై తిష్ట వేసిన కోతులు ద్విచక్రవాహనాలు, ఆటోలు, పాదచారుల వెంట పడి వారి వద్ద ఉండే సరుకుల కవర్లను లాక్కుంటున్నాయి.

ఒక్కసారిగా మీదకు వస్తున్న కోతుల వారంతా భయందోళన చెందుతున్నారు. అలాగే కొంతమంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయపడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారిపై నెలకొన్న కోతుల సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలని వాహనదారులు వినతి చేస్తున్నారు.

నాణ్యతకు ఎగనామం

- నిబంధనలు పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు
- నూనె ఒకటే.. వండేవి ఎన్నో..
- ఫ్రిడ్జిలో మాంసాహారం నిలువ
- అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహణ



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వేస్తున్న మిర్చి బజ్జీలు



కళాయిలో అతిగా మరిగిన నూనె

భద్రాచలంటౌన్: పట్టణాలు, పల్లెటూర్లు తేడా లేకుండా ఈ మధ్య కాలంలో ఇంటి ఆహారం కంటే పిల్లల నుంచి పెద్దల వరకు బయట ఆహారాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్‌కు బాగా అలవాటు పడిపోయారు. గతంలో అప్పుడప్పుడు సెలవు రోజుల్లో కుటుంబంతో సరదాగా బయటకు వెళ్లి తినేవారు. కానీ ప్రస్తుత రోజుల్లో పొద్దున తినే అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకు టిఫిన్ బళ్లు, హోటళ్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనికి ప్రస్తుత జీవనశైలి ఒక కారణం అయితే.. వండుకునే ఓపిక, సమయం లేకపోవడం మరో కారణం. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారే తప్ప.. ఆహారంలో నాణ్యతను పాటించడం లేదు.

అనారోగ్యానికి కేరాఫ్‌గా..

హోటళ్లలో త్వరగా లభించే ఆహార పదార్థాలకు అలవాటు పడిన ప్రజలు వాటి నాణ్యతను పరిశీలించడం లేదు. సమోస, గారెలు, బజ్జీలు, వడలు వీటితో పాటు వేడిగా లభించే చికెన్ వెజ్ మంచూరియా, చికెన్ కబాబ్, చికెన్ పకోడి, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వాటిని తీసేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న కొందరు వ్యాపారులు రోజుల తరబడి కళాయిలో వంట నూనెను మార్చకుండా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పట్టణాల్లో ఒకటి రెండు హోటళ్లు మినహా ఇతర వాటిల్లో పరిశుభ్రత పాటించటం లేదు. మాంసాహార హోటళ్లలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. మిగిలిపోయిన మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో ఉంచి.. తర్వాత రోజు వినియోగిస్తున్నారు. వీటన్నిటి మూలంగా సాధారణ ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

నిబంధనలు పాటించిన హోటళ్ల తనిఖీలకు వచ్చిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ కనీసం దుకాణాలను తనిఖీ చేయడం లేదు. మామూళ్లకు అలవాటు పడి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..



కల్తీ ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వు పెరగడం, స్థూలకాయం, కేన్సర్ల బారినపడే ప్రమాదం ఉంది. కొన్ని హోటళ్లలో పదార్థాలు ఎక్కువ సార్లు ఫ్రై చేస్తుంటారు. వాటిని తినడం ఆరోగ్యానికి హానికరం. వాటి విషయంలో తగిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

– రేపాక చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ